# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 24 జూలై 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 16

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## ముఖ్యమంత్రిపై కేటీఆర్ విమర్శలు

**గ్లోబరీనా అంశంపై సవాల్**

**విచారణకు సిద్ధమని స్పష్టీకరణ**



వరంగల్‌లో గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. గ్లోబరీనా సంస్థ అంశంలో తనపై చేసిన ఆరోపణలపై ఇప్పటికే పరువు నష్టం దావాకు సంబంధించి న్యాయపరమైన నోటీసు పంపించినట్లు తెలిపారు.

వరంగల్, జూలై 23: ఆరోపణలను నిరూపించాలని, లేకుంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గ్లోబరీనా సంస్థ నిజంగానే తన బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందో సమాధానం చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవైపు ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, మరోవైపు దానిని (మిగతా 2వ పేజీలో)



2

## ఓయూ, జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా



# సింగరేణి బలోపేతమే... ప్రభుత్వ లక్ష్యం

**సత్తుపల్లి గనిలో భట్టి విక్రమార్క తనిఖీ.. దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికకు ఆదేశాలు**



సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేసి భవిష్యత్ తరాలకు లాభదాయక ప్రభుత్వ రంగ సంస్థగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సత్తుపల్లి బహిరంగ బొగ్గు గనిని సందర్శించిన ఆయన బొగ్గు నిల్వలు, తవ్వకాల ప్రక్రియ, బొగ్గు నాణ్యతను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఖమ్మం, జూలై 23: అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి తెలంగాణ ఆత్మ అని, రాష్ట్ర ప్రజలకు, కార్మికులకు ఈ 130 ఏళ్ల సంస్థతో విడదీయరాని అనుబంధం ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థల ప్రవేశం, విదేశీ బొగ్గు దిగుమతుల పెరుగుదలతో బొగ్గు రంగంలో పోటీ తీవ్రంగా మారిందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పరిస్థితుల్లో సింగరేణి (మిగతా 2వ పేజీలో)



-2లో

### కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్

# రాజకీయాలు

**గతంలో లీక్ అయితే కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా**

**టెన్త్ లీకేజీలో రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు**

**కేంద్రమంత్రి మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు**

# నేటి తరానికి తగ్గుతున్న ఓపిక

**హనీమూన్ మర్డర్ ఘటనే నిదర్శనం**

**సోనమ్ బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు**



-2లో

## యువత సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఉత్తమ్

**బీజేపీపై మంత్రి తీవ్ర విమర్శలు**

**రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రశంసించిన మంత్రి**

**యువతకు కాంగ్రెస్ అండగా ఉంటుందని స్పష్టం**



హైదరాబాద్, జూలై 23 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువత ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. నిరుద్యోగం, పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులు, విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి కారణంగా యువతలో తీవ్ర అసంతృప్తి పెరిగిందని (మిగతా 2వ పేజీలో)



## విద్యార్థుల యూనిఫాంలపై ఫీడ్‌బ్యాక్ సేకరణ

**వాట్సాప్ ద్వారా అభిప్రాయాలు తీసుకోనున్న ప్రభుత్వం**

**నాణ్యత విషయంలో రాజీ లేదన్న ముఖ్యమంత్రి**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన అనంతరం వాటి నాణ్యత, సైజు, రంగు తదితర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపడతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్, జూలై 23: విద్యార్థుల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి యూనిఫాంల పంపిణీ విధానం, రంగులు, ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష (మిగతా 2వ పేజీలో)



## సీజేపీ నిరసనలపై హైకోర్టులో పిల్

**విదేశీ నిధులపై దర్యాప్తు కోరిన పిటిషనర్.. శుక్రవారం విచారణ చేపట్టనున్న ధర్మాసనం**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో పార్లమెంట్' నిరసనల నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ ఆందోళనల నిర్వహణకు విదేశీ నిధులు అందినట్లు ఆరోపిస్తూ, ఆ అంశంపై జాతీయ దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని పిటిషనర్ కోర్టును కోరారు.

న్యూఢిల్లీ, జూలై 23: ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సతీశ్ కుమార్ అగర్వాల్ దాఖలు చేయగా, అడ్వకేట్ బారున్ కుమార్ సిన్హా తరఫున వాదనలు వినిపించనున్నారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి డీకే ఉపాధ్యాయ, (మిగతా 2వ పేజీలో)

### మహానగరం నడిబొడ్డున

# పేదోడికి ఇల్లు ఉండొద్దా

**పేదలకు ఇళ్లు కడితే... ఎందుకంత కడుపుమంట?**

**పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే... విష ప్రచారమా?**

**కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?**

**రూ. 60 లక్షల విలువైన ఇంటిని ఆరు లక్షలకే ఇస్తుంటే బీఆర్ఎస్ కు కడుపుమంట**

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను దగా చేసింది బిఆర్ఎస్ఇండ్ల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

-2లో



వేగుచుక్క

# మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేక పోయింది. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చవలసిన బాధ్యతను విస్మరించి, వారిని నగరానికి దూరంగా నెట్టివేసింది. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు దూరంగా 30?40 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులోనే గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోంది.

## కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్ రాజకీయాలు

న్యూఢిల్లీ: జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. యూపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తోపాటు రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహిన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించే సత్తా మీకు ఎక్కడిదంటూ తెలంగాణలోని అధికార పార్టీ నేతల తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

## నేటి తరానికి తగ్గుతున్న ఓపిక

న్యూఢిల్లీ: సమాజం అనేక మార్పులకు లోనవుతున్న కారణంగా హనీమూన్ మర్డర్ లాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయని సుప్రీం కోర్టు తాజాగా వ్యాఖ్యానించింది. గతేడాది హనీమూన్ సందర్భంగా భర్తను హత్య చేసిన సోనమ్ రఘువంశీ బెయిల్‌పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలను చేసింది. ఈ కేసులో జస్టిస్ ఎం. ఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలె ధర్మాసనం సోనమ్ బెయిల్‌ను రద్దు చేసింది. ఆమె మూడు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. మారుతున్న సమాజంలో ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయి. నేటి తరానికి ఓపిక తక్కువ. సమస్యలకు తక్షణ పరిష్కారాలు కావాలని వారు కోరుకుంటున్నారు. 'హనీమూన్‌కు వెళ్లే భర్త తన వెంట బాడీగార్డులను కూడా తీసుకెళ్లినట్టు చెప్పే కామెడీ రీల్స్ వస్తున్నాయి. భార్యాభర్తల మధ్య ఒకప్పుడున్న పరస్పర విశ్వాసం క్రమంగా తగ్గిపోతోంది. గతంలో ఇలాంటి సందర్భాల్లో ఉమ్మడి కుటుంబాలు భార్యాభర్తల సమస్యలను మెరుగ్గా పరిష్కరించేవి' అని సొలిసిటర్ జనరల్ మెహతా చెప్పారు.ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ.. 'మీరు ఉమ్మడి కుటుంబంలోని వారైతే అసంతృప్తిని ఎదుర్కోవడం, సర్దుకుపోవడం అలవాటు అవుతుంది. చిన్న కుటుంబాల్లోని వారు ఏదైనా తక్కువైతే మారాం చేస్తారు' అని వ్యాఖ్యానించింది.

### కాళేశ్వరం అవినీతికి అండగా రేవంత్ చర్యలు

న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఈ 30 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ సందేహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం సీబీఐ విచారణకు ఎందుకు ఇవ్వలేదని తెలంగాణ సీఎంను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. గురువారం న్యూఢిల్లీలో బీజేపీ ఎంపీ మాట్లాడుతూ.. రూ.30 వేల కోట్ల విలువైన పనులు జరిగిన తర్వాత ఎన్డీఎస్ఏ దగ్గరకు వచ్చారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ. లక్ష కోట్లు నీళ్లలో పోయాయని కేంద్ర జలశక్తి మంత్రి పార్లమెంట్‌లో చెప్పారని గుర్తు చేశారు. రూ. లక్ష కోట్లు ముంచిన
కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి కాపాడుతున్నాడని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్, కేటీఆర్ దోచుకున్న పైసలను ప్రస్తుతం వారి నుంచి సీఎం రేవంత్ దోచుకుంటున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఎంత తీసుకున్నాడు.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎంత ఇచ్చాడని ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. తెలంగాణలో సాగు, తాగు, థర్మల్ పవర్ ప్లాంట్లకు నీరు అందడం లేదని అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రజల సంపద లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఏం చేద్దామను కుంటున్నారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చేసినవారు, ప్రస్తుతం కాపాడే వ్యక్తి బాగానే ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు.

# సింగరేణి బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అత్యుత్తమ నాణ్యత గల బొగ్గును ఉత్పత్తి చేయడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. గనుల్లో పేలుళ్లు, లోడింగ్ సమయంలో మట్టి, రాళ్లు బొగ్గులో కలవకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

నాసిరకం బొగ్గు సరఫరా వల్ల రవాణా వ్యయం పెరగడంతో పాటు ఉష్ణ విద్యుత్ కేంద్రాల పనితీరు దెబ్బతింటుందని, విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు, ఇతర వినియోగదారులకు నాణ్యమైన బొగ్గునే సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ప్రతి లోడింగ్ కేంద్రంలో కంపెనీ అధికారులు కచ్చితమైన పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. గత పదేళ్లలో కొత్త బొగ్గు గనుల వేలాల్లో పాల్గొనకపోవడం వల్ల సింగరేణి పలు అవకాశాలను కోల్పోయిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒక బొగ్గు గనిని సొంతం చేసుకున్న తర్వాత భూసేకరణ, అటవీ అనుమతులు, తవ్వకాల ప్రారంభానికి ఏడు నుంచి ఎనిమిది సంవత్సరాలు పడుతుందని, అందువల్ల కనీసం పదేళ్ల దూరదృష్టితో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు సంయుక్తంగా దీర్ఘకాల ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

తాడిచెర్ల--2, నైనీ బొగ్గు గనులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని భట్టి విక్రమార్క తెలిపారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా జరిగే బొగ్గు గనుల వేలాల్లో సింగరేణి పాల్గొనేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛ ఇంధన వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణి బొగ్గు ఉత్పత్తితో పాటు సౌర విద్యుత్ రంగంలోనూ విస్తరించాలని సూచించారు. సింగరేణికి ఉన్న గనుల అనుభవం, సాంకేతిక నైపుణ్యాన్ని



వినియోగించి సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన కీలక ఖనిజాలు, అరుదైన ఖనిజాల అన్వేషణలో కూడా అడుగులు వేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సింగరేణిని ప్రపంచస్థాయి పోటీని తట్టుకునే లాభదాయక సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, విద్యుత్ ఉత్పత్తి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పొత్రు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., శాసనసభ్యులు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీడ్‌బ్యాక్ సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన యూనిఫాంలు అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులకు స్పష్టం చేశారు. ఆగస్టు 15వ తేదీలోగా రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి యూనిఫాంలు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరిగినా సహించబోమని హెచ్చరించారు. మహిళా సంఘాలు యూనిఫాంల కుట్టు పనులను వేగవంతం చేసేలా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గతంలో యూనిఫాంల పంపిణీ వ్యవస్థలో లోపాలు ఉన్నాయని పేర్కొన్న ముఖ్యమంత్రి, ప్రస్తుతం మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ నాణ్యమైన యూనిఫాంలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 2వ తేదీ నాటికే విద్యార్థులకు యూనిఫాంలు అందేలా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిపై కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

తన బినామీ సంస్థగా ఆరోపించడం సమంజసం కాదన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించరని కేటీఆర్ విమర్శించారు. రాజ్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకమని ఆరోపించారు. పగలు కాంగ్రెస్‌తో, రాత్రి బీజేపీతో ఉంటూ రెండు పార్టీల మధ్య రాజీ రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పాత కేసుల భయం, అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో రాజీ పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు ఒక మూట, బీజేపీకి రెండు మూటలు పంపుతున్న పాలన ఇదేనని విమర్శించారు. గ్లోబరీనా అంశంపై సీఐడీ విచారణకు తాను పూర్తిగా సిద్ధమని కేటీఆర్ స్పష్టం చేశారు. అదే విధంగా ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించిన అవినీతి ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీఐడీతో విచారణకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. అవసరమైతే అబద్ధ నిర్ధారణ పరీక్షకు కూడా తాను సిద్ధమేనని, ముఖ్యమంత్రి కూడా అందుకు ముందుకు రావాలని సవాల్ విసిరారు. తనపై చేసిన ఆరోపణలకు ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలు సమర్పించాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఓయూ, జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా

న్యూఢిల్లీ: ఢిల్లీలో 'ఛలో పార్లమెంట్' సందర్భంగా విద్యార్థులపై లాఠీఛార్జికి నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునివ్వడంతో ఉస్మానియా యూనివర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం ఓయూ, అనుబంధ కాలేజీల్లో జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసింది. పరీక్షల వాయిదాకు సంబంధించిన సమాచారాన్ని అనుబంధ కళాశాలలకు తెలిపింది. విద్యార్థి సంఘాల రాష్ట్ర వ్యాప్త బంద్ నేపథ్యంలో శుక్రవారం నాటి ఎగ్జామ్స్ గురించి విద్యార్థులు ఆందోళన చెందవద్దని.. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఓయూ అధికారులు వెల్లడించారు. అటు.. జేఎన్‌టీయూలో సైతం శుక్రవారం జరగాల్సిన పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ విషయాన్ని గురువారం జేఎన్‌టీయూ యాజమాన్యం వెల్లడించింది. తెలంగాణ యూనివర్సిటీ, మహాత్మ గాంధీ యూనివర్సిటీ లోనూ పరీక్షలను వాయిదా వేశారు. శుక్రవారం జరగాల్సిన పరీక్షలకు త్వరలోనే కొత్త తేదీలు ప్రకటిస్తామని అనుబంధ కాలేజీలకు టీయూ అధికారులు సమాచారమిచ్చారు. శుక్రవారం నాటి బంద్ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐపీఎస్‌యూ, ఏఐఎస్‌బీల ఆధ్వర్యంలో జరగనుంది. బంద్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 11:00 గంటల నుండి నారాయణ గూడ చౌరస్తా నుండి వై జంక్షన్ వరకు " విద్యార్థి ర్యాలీ " నిర్వహించనున్నారు.

# కేంద్రాన్ని ప్రశ్నించిన ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వానికి యువతతో దూరం పెరుగుతోందని అన్నారు. యువత, విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేపడితే వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ప్రశ్నించే స్వరాలను అరెస్టులు, బెదిరింపులతో అణచివేయాలని చూడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు.

ఇలాంటి పరిస్థితుల్లో భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యువతకు అండగా నిలుస్తూ వారి సమస్యలపై నిరంతరం గళమెత్తుతున్నారని మంత్రి పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన రాజీలేని పోరాటం చేస్తున్నారని, యువత ఆశయాలకు ప్రతినిధిగా నిలుస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ రాజకీయాలు ప్రేమ, న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువలపై ఆధారపడి ఉన్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందువల్ల దేశ యువత, మేధావులు, మధ్యతరగతి ప్రజల్లో ఆయనపై విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. దేశానికి ప్రత్యామ్నాయ నాయకత్వంగా రాహుల్ గాంధీ ఎదుగుతున్నారని అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, యువత ఉపాధి, సామాజిక న్యాయానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దేశ యువత భయపడకుండా తమ హక్కులు, భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు సాగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, దేశంలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే దిశగా పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# సీజేపీ నిరసనలపై హైకోర్టులో పిల్

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తి తేజస్ కరియాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. 'చలో పార్లమెంట్' నిరసనల కారణంగా దేశ రాజధాని ఢిల్లీలో సాధారణ జనజీవనం తీవ్రంగా ప్రభావితమైందని పిటిషన్‌లో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశంతో ప్రారంభమైన ఉద్యమం తరువాత రాజకీయ మలుపు తిరిగిందని, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొన్నారని ఆరోపించారు.

ఈ నిరసనలకు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు తెలిపారని, ఆయనకు విదేశీ సంస్థలతో సంబంధాలు ఉన్నాయని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోర్టును కోరారు. అయితే పిటిషన్‌లో చేసిన ఆరోపణలు ప్రస్తుతం కోర్టు పరిశీలనలో ఉన్నాయని, వాటిపై ఇంకా ఎలాంటి న్యాయపరమైన నిర్ధారణ వెలువడలేదని గమనించాల్సి ఉంది. ఈ ఆరోపణలపై సంబంధిత పక్షాల వాదనలు, కోర్టు విచారణ అనంతరం తదుపరి పరిణామాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. శుక్రవారం జరగనున్న విచారణలో పిటిషనర్ వాదనలు, సంబంధిత పక్షాల అభిప్రాయాలను విన్న అనంతరం ఢిల్లీ హైకోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## నేడు పండగలా మెగా పీటీఎం 4.0

(మొదటి పేజీ తరువాయి)

అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లీప్ యాప్ ప్రదర్శనతో పాటు ముఖ్య అతిథులు ప్రసంగాలు, ప్రశ్నోత్తరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద సిద్ధం చేసిన ఆహారాన్ని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, అతిథులు రుచిచూస్తారని తెలిపారు. చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాల మేరకు డీఈవో ఎల్.చంద్రకళ, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆర్.రమేష్‌బాబు.. పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు, గౌరవ ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని సూచించారు.

## 'నేతన్న భరోసా'కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమం కోసం 'నేతన్న భరోసా' (నేతన్నల సేవలో) పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ పథకం కింద 50 ఏళ్లలోపు వయస్సు ఉండి, దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న చేనేత కుటుంబాలకు ఏటా రూ.25,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నారు. ఇక రాష్ట్రంలో రెండో దశ కింద 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై మరింత లోతుగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశాల మేరకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఉపసంఘం నివేదిక అందిన తర్వాత తదుపరి కేబినెట్ సమావేశంలో ఉద్యోగాల భర్తీపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలో మౌలిక వసతులు, నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు కేబినెట్ పలు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641.10 కోట్లు, హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల పెరిగిన అంచనా వ్యయం రూ.312 కోట్లకు ఆమోదం తెలిపారు. అలాగే రాబోయే గోదావరి పుష్కరాల సమర్థ నిర్వహణ, భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం రూ.50 కోట్ల నిధులను కేబినెట్ మంజూరు చేసింది. వీటితో పాటు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. విద్యా రంగానికి సంబంధించి వెదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కేబినెట్ అంగీకరించింది.

వేగుచుక్క

# చేనేత సంఘం అధ్యక్షురాలిగా రాజేశ్వరి ఎన్నిక.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాదు**



చేనేత సహకార సంఘం ఎన్నికల తుదిఘట్టం ముగిసింది. చేనేత సంఘం అద్యక్షురాలిగా గుజ్జ రాజేశ్వరి ఎన్నికయ్యారు. నిజామాబాదు చేనేత సహకార సంఘం ఎన్నికలు మంగళవారం నగరంలోని చేనేత సంఘ భవనంలో జరగగా డైరెక్టర్లుగా గెలుపొందిన వారు గురువారం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. నాలుగు పదవులకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్ష పదవికి మూడు నామినేషన్లు దాఖలు కాగా మిగిలిన పదవులకు రెండు నామినేషన్ల చొప్పున దాఖలయ్యాయి. అధ్యక్ష పదవితో పాటు ఉపాధ్యక్ష పదవికి కూడా నామినేషన్ వేసిన డైరెక్టర్ గుద్దేటి రామకృష్ణ ఉపాధ్యక్ష పదవికి వేసిన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం నాలుగు పదవులకు గానూ ఇద్దరు చొప్పున అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం నాలుగు పదవులకు ఎన్నికలు జరగగా డైరెక్టర్లు అద్యక్షురాలిగా గుజ్జ రాజేశ్వరిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అవదూత విఠల్, ప్రధాన కార్యదర్శిగా పెంటి రాజు, కోశాధికారిగా నందాల నరేష్ ఎన్నికయ్యారు. మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్లకు గానూ తొమ్మిది మంది ఎన్నికలో పాల్గొన్నారు. విజయం సాదించిన అభ్యర్థులకు ఐదు చొప్పున ఓట్లు రాగా ఓటమి పాలైన అభ్యర్థులకు నాలుగు చొప్పున ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారిగా జిల్లా సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ పోషన్న వ్యవహరించారు.

**చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి: గుజ్జ రాజేశ్వరి.**

చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అద్యక్షురాలిగా ఎన్నికైన గుజ్జ రాజేశ్వరి అన్నారు. అనంతరం సంఘ కార్యాలయం వద్ద జిల్లా పద్మశాలి సంఘం ఆద్వర్యంలో టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు దీకొండ యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతల గంగాదాస్, పద్మశాలి హాస్టల్ ప్రధాన కార్యదర్శి, గంట్యాల వెంకట్ నర్సయ్య, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బింగి ధరంవీర్, జిల్లా అద్యక్షులు తన్నీరు శ్రీనివాస్, జిల్లా పద్మశాలి సంఘం ప్రతినిధులు తులసి, విష్ణువర్ధన్, పెంటి రవి, సురుకుట్ల విజయ్, రాపెల్లి రాజు, ఎల్. దేవీదాస్, తదితరులు పాల్గొన్నారు.. ఎన్నికల సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఘనంగా టీజీప ఆవిర్భావ దినోత్సవం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన నాలుగు సంఘాల్లో ఒకటైన జాతీయ జర్నలిస్ట్ యూనియన్ అనుబంధ తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను, జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు జి. సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.
ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని మానసిక వికలాంగుల (స్నేహ సొసైటీ ఫర్ రూరల్ కన్స్ట్రక్షన్) ప్రత్యేక పాఠశాలలో విద్యార్థులకు బిస్కెట్లు తదితర వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ... టీజీప ఫౌండర్ ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు కెవి రమణారావు, ప్రధాన కార్యదర్శి గోరి నేతృత్వంలో జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పోరాటం సాగుతోందని అన్నారు. అలాగే సామాజిక సేవ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారని కొనియాడారు. స్నేహ సొసైటీ ఫర్ రూరల్ కన్స్ట్రక్షన్ కార్యదర్శి సిద్దయ్య మాట్లాడుతూ, టీజీప అవిర్భావాన్ని కేవలం వేడుకగానే కాకుండా, ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం, విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేయడం, ఇతర వితరణ వంటి సేవ కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీజీప ప్రతినిధులు కొట్టూరి ప్రమోద్, తమ్మాలి పాండు, ఆర్.శ్రీనివాస్ రెడ్డి, పి.యశస్వి, పి. మురళీ కృష్ణ, వికాస్ గైక్వాడ్, పులగం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రోడ్డు భద్రతకు కేంద్రం పెద్దపీట

## నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో బ్లాక్ స్పాట్ల నివారణకు రూ.1,023 కోట్లు

## లోక్ సభలో ఎంపీ అర్వింద్ ప్రశ్నకు మంత్రి గడ్కరీ సమాధానం

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్ల నివారణ, రహదారి భద్రతా చర్యలకు సంబంధించి తాను లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇచ్చిన సమాధానంలో కీలక వివరాలు వెల్లడయ్యాయని ఆయన తెలిపారు.తెలంగాణలో గత కొన్నేళ్లలో ప్రమాదాల ఆధారంగా మొత్తం 1,513 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 1,308 బ్లాక్ స్పాట్లకు సంబంధించిన శాశ్వత నివారణ చర్యలు పూర్తయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపీ అర్వింద్ తెలిపారు. మరో 205 బ్లాక్ స్పాట్లలో శాశ్వత నివారణ చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు.నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిజామాబాద్ జిల్లాలో మొత్తం 78 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 75 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 3 ప్రాంతాల్లో చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అదేవిధంగా జగిత్యాల జిల్లాలో మొత్తం 107 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, అందులో 99 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 8 ప్రాంతాల్లో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపీ తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ ప్రజల భద్రతకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమన్నారు.నిజామాబాద్ జిల్లాలో జాతీయ రహదారులపై రోడ్డు భద్రతను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి తన వంతు కృషి కొనసాగుతుందని అర్వింద్ తెలిపారు.నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రోడ్డు భద్రతకు కట్టుబడి ఉన్నాంనిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రహదారులు, సురక్షితమైన ప్రయాణం అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎంపీ అర్వింద్ అన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తామని తెలిపారు.నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో జాతీయ రహదారుల అభివృద్ధి, బ్లాక్ స్పాట్ల నివారణ, వంతెనలు, బైపాస్‌లు, ఇతర రోడ్డు భద్రతా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సుమారు



రూ.1,023 కోట్లు కేటాయించిందని ఎంపీ అర్వింద్ తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా రోడ్డు భద్రతా పనులను మరింత వేగవంతం చేయడానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# దేశభక్తి కార్మిక సంక్షేమమే బీఎంఎస్ ధ్యేయం..

**- ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్..**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



దేశభక్తి కార్మిక సంక్షేమం సామాజిక బాధ్యతలను కేంద్ర బిందువుగా చేసుకొని భారతీయ మజ్దూర్ సంఘ్ ను ప్రారంభించారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ నర్యనారాయణ తెలిపారు. భారతీయ మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని నిజామాబాద్ 2 డిపోలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోకమాన్య బాల గంగాధర్ తిలక్ జయంతి రోజున దత్తో పంత్ తెంగడి బీఎంఎస్ ను స్థాపించారని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, ఉపాధి అవకాశాల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే కార్మికుల హక్కులు, దేశ ప్రయోజనాలు ముఖ్యమనే సిద్ధాంతంతో పనిచేస్తుందన్నారు. దేశంలో సభ్యత్వం పరంగా అతిపెద్ద కార్మిక సంఘాల్లో ఒకటిగా గుర్తింపు పొందడం సంతోషకరమన్నారు. ప్రధానంగా " వికసిత్ భారత్" నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమని శ్రమకు గౌరవం ఇవ్వడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. దేశానికి రైతు అన్నం పెడితే కార్మికుడు దేశాన్ని నిర్మిస్తాడని కొనియాడారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికులను సంఘటితం చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు శ్రావణ్, మఠం పవన్, జ్యోతి మురళి, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయరెడ్డి, శ్రీనివాస్ చారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వామి కుమార్, ఆర్టీసీ కార్మిక సంఘం ప్రతినిధులు కే.బీ.సింగ్, సరోజ, రాములు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి.



















**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, జూలై 22:**

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలనీ టీయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన "తరంగ్--2026" వార్షికోత్సవం కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాలు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కావని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాయకత్వ లక్షణాలు వంటి అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటాలని సూచించారు. లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

**సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డా.సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ,**

సౌత్ క్యాంపస్ లో వివిధ విభాగాలు సాధించిన ప్రగతిని వివరించారు. తాము కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. భవిష్యత్ లో జరగబోయే అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం కూడా అవసరమని తెలిపారు.పరిశోధనలోనూ, విద్యార్థులకు ఉద్యోగ కల్పన కోసం కట్టుబడి ఉన్నామని తెలిపారు. విద్యార్థులు తాము చదువుకొని సమాజానికి సేవ చెయ్యాలని తెలిపారు. సౌత్ క్యాంపస్ అభివృద్ధికి పై అధికారులతో సమన్వయంతో పని చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి డా. ప్రతిజ్ఞ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, హాస్టల్ వార్డెన్ లు డా. యాలాద్రి, డా. సునీత, అధ్యాపకులు డా. అంజయ్య, డా. లలిత, డా.హరిత, డా. సబిత, డా. నాగరాజు, డా.కవిత తోరణ్, డా. నారాయణ, డా. రమాదేవి, డా. నర్సయ్య, వైశాలి, డా. నిరంజన్ , శ్రీకాంత్, దిలీప్, డా. శ్రీమాత, డా. ఇంద్రకరణ్, డా. కనకయ్య, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్, విజయ్, సునీల్ , మహిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

**టీయూ రిజిస్ట్రార్ యాదగిరి. టీయూ దక్షిణ ప్రాంగణంలో ఘనంగా "తరంగ్--2026" వార్షికోత్సవం. ఆటపాటలతో అలరించిన విద్యార్థులు.**

వేగుచుక్క



# 'స్పిరిట్' షూటింగ్ 40% పూర్తి

హైదరాబాద్, జులై 22

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'స్పిరిట్' చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. అమెరికాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా సినిమా పురోగతిపై కీలక సమాచారం వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'స్పిరిట్' చిత్రీకరణలో ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభాస్ అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమాను రూపొందిస్తున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన ప్రచార చిత్రాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ వేగంగా సాగుతుండటంతో త్వరలోనే విడుదల తేదీతో పాటు ఇతర వివరాలపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్ శక్తివంతమైన పోలీసు అధికారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఆయన సరసన తృప్తి డిమ్రి కథానాయికగా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ భారీ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కార్యక్రమంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక ప్రముఖ చిత్రంలోని పాటకు ఆయన వేసిన స్టెప్పులు అక్కడున్న వారిని ఆకట్టుకోగా, ఆ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది.

# ధనుష్‌తో మురళీకిశోర్ కొత్త సినిమా?

హైదరాబాద్, జులై 22

'లెనిన్' సినిమాతో విజయాన్ని అందుకున్న దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి తన తదుపరి చిత్రంపై దృష్టి సారించారు. గ్రామీణ నేపథ్యంతో రూపొందించిన 'లెనిన్' ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, తన కొత్త చిత్రానికీ అదే తరహా నేపథ్యాన్ని ఎంచుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈసారి కథ, పాత్రలు, భావోద్వేగాలు పూర్తిగా భిన్నంగా ఉండేలా రూపొందించినట్లు సమాచారం. ఈ కథ తమిళ అగ్ర నటుడు ధనుష్ ఇమేజ్‌కు అనుగుణంగా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే మురళీకిశోర్ ధనుష్‌ను కలిసి కథ వినిపించనున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. కథకు ఆయన ఆమోదం లభిస్తే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్నట్లు సమాచారం. నటీనటులు, సాంకేతిక బృందం, చిత్రీకరణ ప్రారంభం తదితర వివరాలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.





# చిరంజీవికి విలన్‌గా శరత్‌కుమార్?

హైదరాబాద్, జులై 22

మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన మన శంకర వరప్రసాద్ గారులిచిత్రంతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న ఆయన ప్రస్తుతం పలు ప్రాజెక్టులను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఒకవైపు వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న విశ్వంభర విడుదలకు సిద్ధమవుతుండగా, మరోవైపు దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న మెగా 158 (తాత్కాలిక పేరు) చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. వాల్తేరు వీరయ్య తర్వాత చిరంజీవి-బాబీ కాంబినేషన్ మరోసారి తెరపైకి రానుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

**తాజా సమాచారం ప్రకారం ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రంలో చిరంజీవికి ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకుడి పాత్ర కోసం తమిళ సీనియర్ నటుడు శరత్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. నిజ జీవితంలో చిరంజీవి, శరత్‌కుమార్ సన్నిహిత మిత్రులు. గతంలో గ్యాంగ్ లీడర్,లిస్టూవర్ట్‌పురం పోలీస్ స్టేషన్ చిత్రాల్లో కలిసి నటించిన వీరిద్దరూ దాదాపు 35 ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే సినిమాలో కనిపించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది.**

గతంలో శరత్‌కుమార్ పలు సందర్భాల్లో మాట్లాడుతూ చిరంజీవి తనకు అత్యంత ఆప్తమిత్రుడని, జీవితంలోని క్లిష్ట సమయంలో ఆయన తనకు అండగా నిలిచారని చెప్పారు. మంచి కథ దొరికితే మళ్లీ కలిసి నటించాలని ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నట్లు కూడా వెల్లడించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటి అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తుండగా, ప్రియమణి, నివేదా పేతురాజ్ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. భారీ యాక్షన్ సన్నివేశాలతో పూర్తి స్థాయి గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో శరత్‌కుమార్ తెలుగు చిత్రాల్లోనూ వరుసగా కీలక పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. లిఅనే నేను, జయ జానకీ నాయక, భగవంత్ కేసరి, రంగబలి వంటి చిత్రాల్లో ఆయన నటనకు మంచి ప్రశంసలు దక్కాయి.



# మళ్లీ బన్నీతో పూజా హెగ్డే?

హైదరాబాద్, జులై 22

**ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం దర్శకుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త సినిమాపై సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉండగా, కథానాయిక ఎంపికపై ఆసక్తికర ప్రచారం జరుగుతోంది.తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో కథానాయికగా పూజా హెగ్డేను ఎంపిక చేసినట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే, 'అల వైకుంఠపురములో' తర్వాత అల్లు అర్జున్, పూజా హెగ్డే జోడీ మరోసారి వెండితెరపై కనిపించనుంది. ఆ చిత్రంలో వీరిద్దరి జోడీకి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. లోకేష్ కనగరాజ్ సినిమాలు యాక్షన్, స్టైలిష్ మేకింగ్, వేగవంతమైన కథనంతో ప్రత్యేక గుర్తింపు పొందాయి. అల్లు అర్జున్‌తో ఆయన కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ చిత్రం కూడా భారీ స్థాయిలో తెరకెక్కనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కథ, నటీనటుల ఎంపిక, ఇతర ప్రీ-ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి. అయితే పూజా హెగ్డే ఎంపికపై వస్తున్న వార్తలు ఇప్పటికీ అధికారికంగా ధృవీకరించబడలేదు. చిత్రబృందం నుంచి ప్రకటన వెలువడిన తర్వాతే ఈ క్రేజీ కాంబినేషన్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.**



# ఆరోగ్యంపై అమితాబ్ స్పష్టత

ముంబై, జులై 22

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఆరోగ్యంపై గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాల కు ఆయన స్వయంగా తెరదించారు. తనకు ఎలాంటి శస్త్రచికిత్స జరగలేదని, ప్రస్తుతం పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నానని స్పష్టం చేశారు. ఇటీవల తన బ్లాగ్‌లో శస్త్రచి కిత్స అనంతరం కోలుకునే ప్రక్రియ గురించి చేసిన వ్యాఖ్యలను చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారని అమితాబ్ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన వ్యక్తి ఎదుర్కొనే పరిస్థితులను ఉదాహరణగా మాత్రమే వివరించానని, అవి తన వ్యక్తిగత ఆరోగ్యానికి సంబంధించినవి కావని చెప్పారు. అర్జెంటీనా–స్పెయిన్ ఫుట్‌బాల్ ఫైనల్ నేపథ్యంలో ఓడిన జట్టు తిరిగి నిలబడే పరిస్థితిని వివరించేందుకే ఆ వ్యాఖ్యలు చేశానని, కానీ వాటిని తన ఆరోగ్యానికి సంబంధించినట్లుగా ప్రచారం చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ వివరణతో అమితాబ్ ఆరోగ్యంపై నెలకొన్న సందేహాలకు తెరపడింది. తాను పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని, త్వరలో ప్రభాస్ నటిస్తున్న 'కల్కి' సీక్వెల్ చిత్రీకరణలో పాల్గొననున్నట్లు కూడా వెల్లడించారు. దీంతో అభిమానులు ఊరట వ్యక్తం చేస్తూ, 83 ఏళ్ల వయసులోనూ ఆయన అదే ఉత్సాహంతో సినిమాల్లో కొనసాగుతున్నందుకు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా: రేఖ

నటి రేఖ వేదవ్యాస్ తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణం, ఆరోగ్య సమస్యల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. చిన్న వయసులోనే జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని, అనుభవం లేకపోవడంతో ఆ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి సమయం పట్టిందని తెలిపారు. అయితే కాలక్రమేణా పరిస్థితులకు అనుగుణంగా తాను మారిపోయానని చెప్పారు. సినీ కెరీర్‌లో ఒక దశలో పని ఆగిపోవడం తనపై తీవ్ర ప్రభావం చూపిందని, అలాంటి పరిస్థితి మళ్లీ రావద్దని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో మంచి రోజులు, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, ఉపాధి, ప్రేమ ఉండాలని ఆకాంక్షించారు. గతంలో ఎదుర్కొన్న ఆరోగ్య సమస్య గురించి ప్రస్తుతం మాట్లాడేందుకు సిద్ధంగా లేనని రేఖ వేదవ్యాస్ స్పష్టం చేశారు. అది తన జీవితంలోని ఒక అధ్యాయమని, దేవుడి దయతో ఇప్పుడు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. ఆ సమయంలో తన కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ముంబైలో నివసిస్తున్నానని, అవసరమైతే హైదరాబాద్‌లోనూ పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

